క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉననాయి. టమాట కిలో రూ. 13, వంకాయ 18, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజి 15, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 20, దొండ 23–28, చిక్కుడు 50, గోకర 55, బీట్‌రూట్ 19, క్యాప్సికం 47, ఆలు 23, దోస 23, సొర 9, పొట్ల 15, ఉల్లి 14 చామగడ్డ 55 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీకృష్ణదేవరాయ నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు స్వామివారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవ కార్యక్రమాలు వాగీశ కృపానిధి వేల్పూరి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. పెరుమాళ్ల తిరుమంజనం, రాజ్యలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట వంటి ప్రత్యేక పూజలు కనులపండువగా నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

'ఐవీఎఫ్'ను మరింత బలోపేతం చేయాలి



నియామకపత్రాలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ స్టేట్ యూత్ జనరల్ సెక్రటరీగా రొంపల్లి సంతోష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా కొల్పూరి నరేష్‌కుమార్‌ను నియామితులయ్యారు. వారికి నియామకపత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా బుధవారం నాగోలు తన క్యాంప్ కార్యాయలంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్, యూత్ ప్రెసిడెంట్ కట్ట రవికుమార్‌గుప్తా, రాష్ట్ర కార్యదర్శి జూలకంటి అశోక్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం

దిల్‌సుఖ్‌నగర్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధ ధీరజ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారలతో చర్చించి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం వరప్రసాద్

హయత్‌నగర్: బస్ స్టాండ్‌లలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీర్చడం గొప్ప విషయమని ఆర్టీసీ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ బస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభిచారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి ఏనుగల శ్రీకాంత్‌రెడ్డి, డీఎంలు రఘు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

పహాడీషరీఫ్: అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని రక్షించేందుకు పోలీస్ సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన పొందాలని పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ సూచించారు. కామినేని ఆస్పత్రికి చెందిన వైద్యుల బృందం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీపీఆర్, ఇతర ప్రాథమిక చికిత్సలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కరోనా అనంతరం చాలామంది హఠాన్మరణాలకు గురవుతున్నారు. గుండెపోటు వచ్చినప్పుడు సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంటుందన్నారు. స్టేషన్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎస్‌ఐలు వెంకటయ్య, అజయ్, నయీముద్దీన్, రమేష్ నాయక్, మధుసూదన్ పాల్గొన్నారు.

చౌరస్తాలకు సొబగులు!

- పచ్చదనంతో నయనానందకరంగా ప్రధాన కూడళ్లు
- అందుబాటులోకి రానున్న ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు



నాగోలు ఫ్లైఓవర్ కింద కనువిందు చేస్తున్న మొక్కలు

నాగోలు: సికింద్రాబాద్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్డులోని నాగోలు బ్రిడ్జి నుంచి మంద మల్లమ్మ చౌరస్తా వరకు రహదారిపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రయాణం సాఫీగా సాగడంతోపాటు.. రోడ్డు మధ్యలో ప్రచ్ఛందాలను పంచే మొక్కలు.. ఫ్లైఓవర్ల కింద సుందరమైన పార్కులను తీర్చిదిద్దుతున్నారు. రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను అందంగా నిర్మిస్తున్నారు.

నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు వివిధ ప్రాంతాల్లో సుందరీకరణ పనులను చేపట్టారు. ప్రధాన చౌరస్తాలను ఆధునీకరిస్తున్నారు. అందులో భాగంగా చేపట్టిన ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

- ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో ప్రధానంగా ఎంతో రద్దీగా ఉన్న నాగోలు, ఎల్‌బీనగర్ చౌరస్తాల్లో నిర్మించిన ఫ్లైఓవర్ల సుందరీకరణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. నాగోలు, ఎల్‌బీనగర్ ఫ్లైఓవర్ కింద నిర్మించిన పార్కులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.
- ఎల్‌బీనగర్ కామినేని జంక్షన్ ఫ్లైఓవర్ కింద ఆక్సిజన్ పార్కు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రోడ్డు మధ్యలోని సెంట్రల్ మీడియన్‌ను పచ్చటి అందమైన మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు.
- నాగోలు బ్రిడ్జి ప్రాంతం నుంచి నాగోలు వైపు ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.
- నాగోలు ప్రాంతంలో నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌ల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌తో పాటు సైక్లింగ్ ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ దారిలో రోడ్డు పక్కన సైక్లింగ్ చేసుకునేందుకు సుందరంగా ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు.
- ఉప్పల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రో రైలు లింక్ పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయా పనులు కూడా పూర్తయితే ఈ ప్రాంతానికి రవాణా పరంగా మరింత మేలు జరగడంతోపాటు ఈ ప్రాంతానికి మరింత శోభ చేకూరనున్నది.
- నాగోలు నుంచి మంద మల్లమ్మ చౌరస్తా వరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు పూర్తయితే నాగోలు చౌరస్తాకు మరింత అందాలు వస్తాయనడం నిర్వివాదాంశం.
- గతంలో నాగోలు చౌరస్తా రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉండేదని.. ప్రస్తుతం పచ్చని మొక్కలతో ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని స్థానికులు, వాహనదారులు పేర్కొంటున్నారు.
- నాగోలు ప్రాంతంలో కొనసాగుతున్న ఫుట్‌పాత్‌లో సైక్లింగ్ ట్రాక్ పనులు పూర్తయితే నాగోలు చౌరస్తాలో కొత్తందాలు అందుబాటులో వస్తాయి.



నాగోలులోని ఫుట్‌పాత్‌తో పాటు సైక్లింగ్ ట్రాక్

'సీఎం రిలీఫ్ ఫండ్' పేదలకు వరం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ఆర్థిక స్తోమత లేని పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఓ వరంలా ఆదుకుంటోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ భారతీనగర్‌కు చెందిన కాసోజు బ్రహ్మచారి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 2.25 లక్షలకు సంబంధించిన చెక్కును బుధవారం ఆయన అందజేశారు. భారతీనగర్‌కు చెందిన ఏడు సంవత్సరాల చిన్నారి దేవర్ష్ నిత్యం జ్వరంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆర్థిక పరిస్థితి బాగాలేక వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ చిన్నారి ఆపరేషన్‌కు అయిన డబ్బుల వివరాలను సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో రూ. 2.25 లక్షలను మంజూరు చేయించాయి. కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సత్యంచారి, నేతల కంచర్ల శివారెడ్డి, భాస్కర్, సాగర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

చైతన్యపురి: కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ సానిటేషన్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంట్రడక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఆయా శాఖల అధికారులతో కలసి డివిజన్‌లోని తిరుమలనగర్ కాలనీలో పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో సమావేశం పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... గతంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో కాలనీల ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేవారని అయినా అవి పరిష్కారం కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అయినా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. వాటర్ వర్క్స్ అధికారులు రజిత, యాదయ్య, శ్రీనివాస్, జీహెచ్‌ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, ఎస్‌ఎఫ్‌ఓ యాక్స్య, సంజీవరెడ్డి, కాలనీ నేతలు హర్ష, శివ, కొత్త నాగిరెడ్డి, సుధీర్‌కుమార్, హరిష్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, నాయకులు నాని, గిరీష్, టింకు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి

నాగోలు: ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ... తగు జాగ్రత్తలు తీసుకోవాలని భారతీయ జనతా యువమోర్చా రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు పవన్‌కుమార్ అన్నారు. సామాజిక న్యాయ వారోత్సవాలలో భాగంగా జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం నాగోలు బండ్లగూడలోని సర్వే నెంబర్ (58) డీఏస్ఆర్‌నగర్‌లో పద్మ నర్సింగ్ హోమ్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేయించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వివిధ బస్తీల్లోని విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగ నవీన్ కుమార్, రంజిత్ ,అనితారెడ్డి, శివ, రాము, ప్రభాకర్ ,మనోజ్, రాహుల్, భార్గవ్ పాల్గొన్నారు.

'హెల్ప్‌లైన్' వాహనాలు నిరుపయోగం



చాదర్‌ఘాట్: రాష్ట్ర మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్ వాహనాలు నిరుపయోగంగా మారాయి. 10 జిల్లాల అవసరాల నిమిత్తం సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ. కోటి 30 లక్షలతో కొనుగోలు చేసి అట్టహాసంగా ప్రారంభించారు. ఆ వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి నిరుపయోగంగా ఉన్నాయి. కనీసం వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు చొరవ చూపి వివిధ జిల్లాలకు పంపిణీ చేసి సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్‌కు అసరాగా ఉపయోగపడేలా కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ కోరుతున్నారు.

కాలనీల్లో సమస్యలపై కార్పొరేటర్ల సమీక్ష

నాగోలు: కాలనీలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. బుధవారం నాగోలు డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ ఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో జీహెచ్‌ఎంసీ ఆధర్యంలో వివిధ శాఖల అధికారులు, హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీదివాకర్‌తో కలసి ఇంటెన్సివ్ శానిటేషన్–ఆర్‌డబ్ల్యూఏ ఇంట్రాక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో వివిధ కాలనీలో సమస్యలపై చర్చించారు.

కొత్తపేట డివిజన్‌లో....

కాలనీలో ఉన్న సమస్యలు అధికారులు వెంటనే పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. బుధవారం కొత్తపేట డివిజన్‌లోని న్యూ మారుతి నగర్ ఈస్ట్ రామభక్త సమాజంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ శానిటేషన్–ఆర్‌డబ్ల్యూఏ ఇంట్రాక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. సరూర్‌నగర్ సర్కిల్ డీసీ కృష్ణయ్యతో పాటు కార్పొరేటర్ పనవన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కాలనీలలో నెలకొన్న సమస్యలను డీసీ కృష్ణయ్య స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్డు సమస్యలు, డ్రైనేజ్ శానిటైజేషన్, దోమలు, నీటి సమస్యలు, సమస్యలను తెలుసుకున్నారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ... కాలనీలలో చాలా సమస్యలు ఉన్నాయని.. వాటిని సత్వరమే సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు అరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రాంకీ అధికారి విజయభారతి, కాలనీ అధ్యక్షుడు దుడ్డు సుబ్రహ్మణ్యం, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన



ఆదర్శనగర్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న కార్పొరేటర్ శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని ఆదర్శనగర్ కాలనీలో మార్నింగ్ వాక్‌లో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యల గురించి కార్పొరేటర్ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐఎస్‌సదన్‌లో ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రహదారులను సైతం ఆధునీకరిస్తామని తెలిపారు. వేసవి కాలం ప్రారంభమైనందున డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. డివిజన్‌లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే వాటర్‌వర్క్స్ అధికారులతో చర్చించి వెంటనే సమస్య పరిష్కరిస్తామని కార్పొరేటర్ తెలిపారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు దశరథ్ రెడ్డి, రమేష్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రైవేట్ ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చంపాపేట: ప్రైవేట్ ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ఇరిగి అజయ్ కార్తీక్ కోరారు. బుధవారం చంపాపేటలోని కృష్ణవేణి టాలెంట్ ఉన్నత పాఠశాలలో టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మంది ప్రైవేట్ ఉపాధ్యాయులకు బీపీ, షుగర్, ఎముకల సాంద్రత, స్త్రీ సంబంధిత, దీర్ఘకాలిక వ్యాధులను కామినేని ఆస్పత్రి వైద్య నిపుణులు పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించటంతో పాటు మందులను అందజేశారు. వైద్య నిపుణులు సయ్యద్ రియాన్‌అలీ, రాధిక, టీపీయూఎస్ సంఘ నాయకులు ఇస్మాయిల్, జగన్‌బాబు, శ్రీరామ్, జయేష్, షేక్ షాజియాబేగం, వర్షా పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

సైదాబాద్: డివిజన్ పరిధిలో ఎక్కడా రహదారులపై మురుగు పారకుండా తగిన చర్యలు తీసుకుంటామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణరవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఏపీఏయూ కాలనీ, కళ్యాణ్‌నగర్ కాలనీల్లో పర్యటించారు. డ్రైనేజీలు నిండి పొంగి పొర్లుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మురుగు పారడాన్ని పరిశీలించిన కార్పొరేటర్ వెంటనే సమస్య పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మురుగు నిండిన డ్రైనేజీలలో ఎప్పటికప్పుడు పూడిక తీసివేయాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌ల ద్వారా ఇబ్బందులు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. సెవరేజ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో పైప్‌లైన్‌లను త్వరలో ఆధునీకరిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ శ్రవణ్‌కుమార్, ఏపీఏయూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయ్‌భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, అనిత, నర్సింహరాజు పాల్గొన్నారు.

స్పష్టమైన అవగాహనతో డివిజన్ అభివృద్ధి

మన్సూరాబాద్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా స్పష్టమైన అవగాహనతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నానని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సెంట్రల్ బ్యాంక్ కాలనీలో బుధవారం మార్నింగ్ వాక్ చేపట్టి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వరద కాలువ పనుల కోసం తవ్వీన రోడ్డు పునర్నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కాలనీలో రోడ్డు మధ్యలోకి వస్తున్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా విద్యుత్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ నేతలు మునుగాల హరీష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అమరేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, బసవ సుబ్రహ్మణ్యం, రాజేందర్, శేఖర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి



ఉప విద్యాశాఖాధికారికి వినతిపత్రమిస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: శంకేశ్వరబజార్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండలం కన్వీనర్ షేక్ మహమూద్ కోరారు. బుధవారం ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి రాధాకృష్ణను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైదాబాద్ మండల పరిధిలోని జీపీఎస్, జీహెచ్ఎస్ శంకేశ్వరబజార్ పాఠశాలలు రెండూ ఒకే ప్రాంగణంలో నడుస్తున్నాయన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా కొంతకాలం క్రితం ప్రారంభించబడిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు ప్రస్తుతం నిలిచిపోయాయని తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి వాటిని పూర్తి చేయకపోతే వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. విద్యార్థులు బడి మానేసి బాల కార్మికులుగా మారే ప్రమాదముందని వివరించారు. శంకేశ్వరబజార్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీపుకోవాలని కోరారు. తమ వినతికి ఉప విద్యాశాఖాధికారి సానుకూలంగా స్పందించారన్నారు. సంఘం ప్రతినిధులు అలివేలు, రజియా, సల్మా పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 20, దొండ 23, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 55, కీర 14, దోసకాయ 23, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 23, చామగడ్డ 55.

సమన్వయంతో పనిచేస్తేనే సమస్యల పరిష్కారం

మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం తీజనగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జీహెచ్‌ఎంసీ ఇంటెన్సివ్ శానిటేషన్ అండ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇన్‌ట్రాక్షన్ ప్రోగ్రామ్‌కు ఆమె హాజరయ్యారు. సఫైర్ ఫంక్షన్ హాల్ ముందు, కేజీహెచ్ హస్పిటల్ ముందు రోడ్డు, వెలగని వీధి దీపాలు, మ్యాన్‌హోళ్ల మరమ్మతులు, స్థానిక పార్కు నిర్వాహణ, చెట్ల కొమ్మల తొలగింపు సమస్యలను కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్వాతి అపార్ట్‌మెంట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని, వీధి కుక్కల బెడద, తాగునీటి సమస్య, నాలాను శుభ్రం చేయాలని, రాత్రి వేళ్లలో అల్లరి మూకలతో ఇబ్బందులు తప్పడం లేదని వారికి చెప్పారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... చిన్న చిన్న సమస్యలు సత్వరమే పరిష్కారించాలని, ఎక్కువగా నిధులు అవసరమైనా చోటా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, జీహెచ్‌ఎంసీ డీఈఈ ప్రదీప్‌కుమార్, జలమండలి ఏఈ చంద్రునాయక్, సెక్టార్–3 ఎస్సై శృతిరెడ్డి, స్ట్రీట్‌లైట్స్ ఏఈ రాజు, శానిటేషన్ జవాన్ రమేష్, ఎంటామాలజీ సూపర్‌వైజర్ గుండప్ప, ఎస్‌ఎఫ్‌ఏలు శ్రీనివాస్, నర్సింగ్, ముజీబ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మోహన్, వరప్రసాద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో విఫలం: సామ

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ప్రజలు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వసతులు కల్పించి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. సుభాష్‌చంద్రబోస్ కాలనీలో నిర్వహించిన బీజేపీ బూత్ స్వశక్తికరణ అభియాన్‌లో భాగంగా కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ... సుభాష్ చంద్రబోస్‌కాలనీలో 160 కుటుంబాలు నివాసముంటున్నాయని, ఇక్కడ ప్రజలు తీవ్ర దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో చిన్న చిన్న డయా ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ ఉన్నందున ఎగువ ప్రాంతాల్లోని కాలనీల నుంచి వచ్చే మురుగునీరు జామ్ కావడంతో ఆ మురుగు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. నేతలు నాగన్న, సత్యపాల్‌సింగ్, దామోదర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రాజేందర్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం జీహెచ్‌ఎంసీ అధికారులతో శ్రీకృష్ణానగర్‌కాలనీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ... ప్రతి కాలనీలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన చెత్తాచెదారం వేయరాదని కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, జలమండలి మేనేజర్ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రేవతి, బీఆర్‌ఎస్ నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బిక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన జాతీయ వికలాంగుల పార్కు గేట్లు



చాదర్‌ఘాట్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేసిన మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కు అధ్వాన స్థితికి చేరుకుంటోంది. దివ్యాంగుల అవసరాల కోసం రూ. 5 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ పార్కును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పార్కు పర్యవేక్షణ కోసం సంవత్సరానికి రూ. 20 లక్షల మేర జీహెచ్‌ఎంసీ ఇస్తున్నప్పటికీ పర్యవేక్షణ కరువై ఏ అధికారి పట్టించుకోవడం లేదని పలువురు వికలాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కుకు గేటు లేకపోవడంతో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారి వికలాంగులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గేటు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.